పాఠశాల సందర్శన

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అశోక్

ఖలీల్‌వాడి, నవంబర్ 16 : నాగారం పాఠశాలను జిల్లా విద్యాధికారి అశోక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి, వారి సామర్థ్యాన్ని పరీక్షించారు. మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుకు గాయాలు

వినాయక్‌నగర్, నవంబర్ 16: నగరంలోని న్యాల్‌కల్ చౌరస్తా వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రీకొడుకుకు తీవ్రగాయాలయ్యాయి. బైక్‌పై వెళ్తున్న న్యాల్‌కల్‌కు చెందిన భూమారావు, అతడి కుమారుడు ధనుష్‌ను అతివేగంగా వచ్చిన టిప్పర్ ఢీకొన్నది. భూమారావు కాలు నుజ్జునుజ్జవగా.. విషయం తెలుసుకున్న ఐదో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని దవాఖానకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

చేప పిల్లల విడుదల

పొతంగల్, నవంబర్ 16: మండలంలోని నాలుగు చెరువుల్లో అధికారులు, స్థానిక నాయకులు కలిసి మొత్తం 85వేల చేప పిల్లలను శనివారం విడుదల చేశారు. మత్స్యకారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నదని వారు తెలిపారు.

కొత్తపల్లిని సందర్శించిన మత్స్యశాఖ ఏడీ

కోటగిరి(పోతంగల్), నవంబర్ 16: మండలంలోని కొత్తపల్లి చెరువును మత్స్యశాఖ ఏడీ ఆంజనేయ స్వామి శనివారం సందర్శించారు. గతంలో వేలం పాటలో చెరువులు దక్కించుకున్న వారి సమయం గడిచిపోయినా.. చేపలు వారే పట్టుకుంటున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మత్స్యశాఖ అధికారి గ్రామాన్ని సందర్శించి విషయంపై వారితో చర్చించారు. మార్చి నెలలో చేప పిల్లలను విడుదల చేశామని, కొంత గడువు కావాలని వేలం దక్కించుకున్న వారు మత్స్యశాఖ అధికారిని కోరారు. ఆయనవెంట సుదర్శన్, పుప్పాల గంగారాం, రమేశ్, ఇట్ట గంగారాం తదితరులు ఉన్నారు.

నిత్య జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలి

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

రాష్ట్రస్థాయి ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నీ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్

కంఠేశ్వర్, నవంబర్ 16: నిత్య జీవితంలో క్రీడలను భాగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో రాష్ట్ర స్థాయి ఓపెన్ మాస్టర్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్-2024 పోటీలను ఆయన ముఖ్య అతిథిగా హాజరూ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతిరోజూ బిజీగా ఉండే వారికి మానసికోల్లాసానికి క్రీడలు ఉపకరిస్తాయని తెలిపారు. ఆఫీసర్స్ క్లబ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ క్రీడలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. నేటి తరం ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ క్రీడలు, వ్యాయామం, యోగా వంటి వాటిని అలవర్చుకుంటున్నారని, ఇది ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. ఆఫీసర్స్‌క్లబ్ ప్రతిష్టను మరింతగా ఇనుమడింపజేసేలా వివిధ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఆఫీసర్స్ క్లబ్ అభివృద్ధికి తన వంతు తోడ్పాటును అందిస్తానన్నారు. రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్, ఆఫీసర్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ.. క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందన్నారు. నిజామాబాద్ ఆఫీసర్స్ క్లబ్‌కు స్విమ్మింగ్ పూల్ మంజూరు చేయించేందుకు జిల్లా యంత్రాంగం తరపున ప్రతిపాదనలు పంపాలని కలెక్టర్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, టీజీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు అలుక కిషన్, ఆఫీసర్స్ క్లబ్ ప్రతినిధులు వెంకటరమణ, గంగాకిషన్, భక్తవత్సలం, రాంకిషన్‌రావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ..

మాక్లూర్, నవంబర్ 16: మండలంలోని మానిక్‌బండార్‌లో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం తనిఖీ చేశారు. రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించి, ఇప్పటివరకు ఎంత ధాన్యం సేకరించారు, రైస్‌మిల్లులకు ఎంత ధాన్యం తరలించారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో మాట్లాడారు. నిబంధనల ప్రకారం ధాన్యం సేకరిస్తామని, ఆందోళన చెందవద్దన్నారు. సన్నరకం ధాన్యానికి మద్దతు ధర బ్యాంకు ఖాతాలో జమైన వారం, పది రోజుల అనంతరం బోనస్ డబ్బులు కూడా జమ అవుతాయని అన్నారు. కలెక్టర్ వెంట మెప్మా పీడీ రాజేందర్, కేంద్రం నిర్వాహకులు, సంబంధిత అధికారులున్నారు.

లోకకల్యాణార్థం కృష్ణ మహరాజ్ పాదయాత్ర

పాదయాత్ర చేస్తున్న పిట్ల కృష్ణ మహరాజ్

సారంగాపూర్, నవంబర్ 16: మల్లారం శివారులోని శ్రీ లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు పిట్ల కృష్ణ మహరాజ్ లోక కల్యాణార్థం శనివారం భక్తులతో కలిసి పాదయాత్రను ప్రారంభించారు. కార్తీకమాసంలో 22 రోజుల పాటు కార్తీకమాస దీక్ష చేపట్టిన అనంతరం ఆయన కందకుర్తి వరకు పాదయాత్రను చేపడుతారు. పాదయాత్ర సందర్భంగా ఆయా గ్రామాల భక్తులు ఆయనకు ఘన స్వాగతం పలికారు.

నాటక రంగానికి నిధులు కేటాయించాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ప్రతినిధి

సుభాష్‌నగర్, నవంబర్ 16: నాటకరంగానికి నిధులు కేటాయించాలని తెలంగాణ నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు సదానందం అన్నారు. నిజామాబాద్‌లోని గీతాభవన్‌లో డ్రామా ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి నాటక కళాకారుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాటక రంగానికి పూర్వవైభవం తీసుకురావడానికి సమాఖ్య ఏర్పడిందన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు శ్రీపాద కుమారశర్మ, వై.సాయన్న, స్నేహమయి ప్రకాశ్, డాక్టర్ రామ్మోహన్‌రావు, కళాధర్, శ్రీనివాస్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు శుభ్రం

శుభ్రం చేసిన ట్యాంక్

రుద్రూర్, నవంబర్ 16: మండలంలోని కొందాపూర్ గ్రామ తాగునీటి ట్యాంకును అధికారులు శనివారం శుభ్రం చేయించారు. తాగునీటిలో జల గలు వస్తున్నాయనే విషయం నమస్తే తెలంగాణ దినపత్రికలో శనివారం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అధికారులు ట్యాంకును శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని ఏఈ అజయ్ తెలిపారు.

సామాజిక తనిఖీ ప్రారంభం

ఇందల్వాయి, నవంబర్ 16: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో 3వ విడుత ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనుల సామాజిక తనిఖీ శనివారం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించిన ఉపాధి పనుల వివరాలను ఎంపీడీవో లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం తనిఖీ చేస్తున్నది. కార్యక్రమంలో ఎంపీవో రాజ్‌కాంత్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదానం

సుభాష్‌నగర్, నవంబర్ 16: కరసేవకుల బలిదానానికి కృతజ్ఞతగా విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 30మంది రక్తదానం చేశారు. నాటి కరసేవకుల త్యాగాన్ని ఈ సందర్భంగా వారు స్మరించుకున్నారు. ఆయా సంఘాల బాధ్యులు దినేశ్‌ఠాకూర్, దయానంద్, ధాత్రిక రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈశా గ్రామోత్సవ క్రీడలు ప్రారంభం

కంఠేశ్వర్, నవంబర్ 16: పాత కలెక్టరేట్ మైదానంలో రూరల్ ప్రీమియర్ లీగ్-2024 సౌత్ ఇండియా లెవల్ 16వ ఈశ గ్రామోత్సవ క్రీడలను అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు ఈషా ఫౌండేషన్ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈషా ఫౌండేషన్ సిబ్బంది మాట్లాడుతూ రెండు రోజుల పాటు వాలీబాల్, త్రోబాల్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

ఉద్యోగులపై దాడి ఆటవిక చర్య

నిరసన వ్యక్తంచేస్తున్న విద్యుత్ ఉద్యోగులు

కంఠేశ్వర్, నవంబర్ 16: వికారాబాద్ జిల్లా కలెక్టర్, బోధన్ తాలూకా ఊట్‌పల్లి అసిస్టెంట్ లైన్‌మన్‌పై దాడిచేయడం ఆటవిక చర్య అని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రవీందర్ అన్నారు. దాడులను నిరసిస్తూ విద్యుత్ ఉద్యోగుల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం నిజామాబాద్ పవర్ హౌస్ ఆవరణలో మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తంచేశారు. జేఏసీ కన్వీనర్ శ్రీనివాస్, 1104 యూనియన్ ప్రెసిడెంట్ రఘునందన్, జేఏసీ కో-కన్వీనర్ తోట రాజశేఖర్, డీఈలు రమేశ్, వెంకటరమణ, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌ది దగా పాలన'

డిచ్‌పల్లి, నవంబర్ 16: కాంగ్రెస్ ప్రభుత్వానిది ప్రజాపాలన కాదని, దగా పాలన అని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు శివ పేర్కొన్నారు. ఏబీవీపీ రాష్ట్రశాఖ పిలుపు మేరకు శనివారం చలో బాసర ట్రిపుల్ ఐటీకి తరలివెళ్లకుండా అతడితోపాటు నాయకులు నవీన్, సిర్ప నితిన్‌ను పోలీసులు అరెస్టు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు.

24,25న మహాభోగ్ సదస్సు

ధర్పల్లి, నవంబర్ 16: బంజారాల ఐక్యత, సమస్యల సాధన కోసం ఈనెల 24, 25న సంగారెడ్డి జిల్లా పసల్‌వాది గుడి తండాలో నిర్వహించనున్న సేవలాల్ మహరాజ్ మహాభోగ్ సదస్సును విజయవంతం చేయాలని గోర్ శిక్వాడి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మాలోత్ శివరాం జాదవ్ కోరారు. మండలంలోని నడిమి తండాలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బంజారా నాయకులు రవిజాదవ్, రాజు, బలరాం మహరాజ్, తండా నాయక్, రాములు జాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

సిరికొండ, నవంబర్ 16: మండలంలోని ముషీర్‌నగర్‌కు చెందిన బట్టు రాధిక(21) అదృశ్యమైనట్లు ఎస్సై రామ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రాధిక కుటుంబ కలహాలతో గురువారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లింది. చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో శనివారం ఆమె భర్త బాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

సులేమాన్‌నగర్‌లో పశువైద్య శిబిరం

రుద్రూర్, నవంబర్ 16: మండలంలోని సులేమాన్‌నగర్ గ్రామంలో శనివారం ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా డాక్టర్ సంతోష్ మాట్లాడుతూ.. 20గేదెలకు గర్భధారణ, రెండింటికి సాధారణ చికిత్సలు నిర్వహించామని చెప్పారు. 13దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు సురేశ్, సాయిరాజ్, తిరుపతి, హన్మాండ్లు, రైతులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కోటగిరి (పోతంగల్), నవంబర్ 16: ప్రభుత్వ అనుమతి లేకుండా ఎత్తొండ శివారు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని సీజ్ చేసినట్లు ఎస్సై సందీప్ శనివారం తెలిపారు. శుక్రవారం రాత్రి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామని చెప్పారు.

గంజ్ రైల్వే గేట్ మూడు రోజులు మూసివేత

వినాయక్‌నగర్, నవంబర్ 16: నిజామాబాద్ గంజ్ ప్రాంతంలో ఉన్న రైల్వే గేట్ ఈనెల 19 నుంచి 21వ తేదీ వరకు మూడు రోజులపాటు మూసి ఉంటుందని రైల్వే అధికారులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో వాహనదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని కోరారు.

నిబంధనలు పాటించాలి

వినాయక్‌నగర్, నవంబర్ 16: విగ్రహాల ఏర్పాటుకు కలెక్టర్ ఆధ్వర్యంలోని కమిటీ నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఇన్‌చార్జి సీపీ సింధూ శర్మ సూచించారు. ఈ మేరకు ఆమె శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీజేలను రాత్రి పది నుంచి ఉదయం ఆరు గంటల వరకు పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. సభలు, సమావేశాలకు పోలీసు అధికారుల అనుమతి తప్పకుండా తీసుకోవాలని పేర్కొన్నారు. నిబంధనలు ఈనెల 30వ తేదీ వరకు అమలులో ఉంటాయని తెలిపారు.

పెండింగ్ కేసులను పరిష్కరించాలి

రుద్రూర్, నవంబర్ 16: పెండింగ్ కేసులను పరిష్కరించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. రుద్రూర్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన శనివారం సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. ఫెండ్రీ పోలీసింగ్‌పై గ్రామాల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఆయనవెంట రుద్రూర్ సీఐ కృష్ణ, ఎస్సై సాయన్న, సిబ్బంది ఉన్నారు.

మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ప్రారంభం

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం

చందూర్/ పొతంగల్, నవంబర్ 16: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో నిర్మించిన మత్స్య పారిశ్రామిక సహకార సంఘాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి శనివారం ప్రారంభించారు. అనంతరం లక్ష్మాపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూముల బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. కోటగిరిలోని అయ్యప్ప, సాయిబాబా ఆలయ ప్రాంగణంలో యాగశాలను ఎమ్మెల్యే పోచారం ప్రా రంభించారు. ఆలయాలు ప్రశాంతతకు నిలయాలని అన్నారు. ఆయనవెంట స్థానిక నాయకులు ఉన్నారు.

బొట్టుపెట్టి మహిళలకు ఆహ్వానం

బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న ఐకేపీ సిబ్బంది

మోర్తాడ్, నవంబర్ 16: కమ్మర్‌పల్లి మండలం కోనాసముందర్ గ్రామంలో మహిళలకు ఐకేపీ సిబ్బంది బొట్టుపెట్టి మహిళా సంఘాల్లో చేరాలని శనివారం ఆహ్వానం పలికారు. ఈసందర్భంగా ఐకేపీ ఏపీఎం కుంట గంగాధర్ మాట్లాడుతూ... సంఘాల్లో చేరిన మహిళలకు రూ.రెండు లక్షల బీమా సౌకర్యం, రుణ సదుపాయం ఉంటుందని, భవిష్యత్తులో మరిన్ని సౌకర్యాలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. కార్యక్రమంలో గ్రామ సమాఖ్య అధ్యక్షురాలు మౌనిక, వీవోఏలు బాలమణి, లత, నయన పాల్గొన్నారు.

పలుగుట్టకు తరలివచ్చిన భక్తులు

భక్తులకు బొట్టు పెట్టి ఆశీర్వదిస్తున్న మంగిరాములు

నందిపేట్, నవంబర్ 16: మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆశ్రమం పలుగుట్టకు కార్తీక పౌర్ణమి, జాతర సందర్భంగా శనివారం భక్తులు తరలివచ్చారు. ఆశ్రమ వ్యవస్థాపకుడు మంగిరాములు మహరాజ్ 36 రోజుల దీక్ష పూర్తి చేసుకుని శుక్రవారం అర్ధరాత్రి దీక్ష గది నుంచి బయటికి వచ్చి భక్తులకు దర్శనమిచ్చారు. శుక్రవారం సాయంత్రం నుంచి జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు ఆశ్రమానికి చేరుకున్నారు. ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేశ్‌రెడ్డి కుటుంబీకులతో కలిసి హాజరై రాత్రంతా ఆశ్రమంలోనే ఉండి మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. భక్తులకు నుదుట బొట్టు పెట్టి మహరాజ్ ఆశీర్వదించారు. సుమారు 30 వేలమంది భక్తులకు అన్నదానం చేశారు.

గోదావరికి మహా హారతి

మహా హారతి ఇస్తున్న బాలయోగి కృష్ణ మహరాజ్

రెంజల్, నవంబర్ 16: మల్లారం లింగేశ్వర గుట్ట ఆశ్రమ వ్యవస్థాపకుడు బాలయోగి కృష్ణ మహరాజ్ లోక కల్యాణార్థం సంకల్పించిన కార్తీక మాస దీక్ష, పాద యాత్ర కందకుర్తి త్రివేణి సంగమక్షేత్రం వద్ద శనివారం ముగిసింది. పలు గ్రామాల భక్తులు మహరాజ్‌కు మంగళ హారతులతో స్వాగతం పలికారు. కందకుర్తి గోదావరి అహల్యబాయి పుష్కర ఘాట్ వద్ద ధర్మ జాగరణ ఆధ్వర్యంలో గోదావరికి మహా హారతిని కృష్ణ మహరాజ్, సీతారాం త్యాగి మహరాజ్ తోకలిసి ఇచ్చారు.

రోడ్డుకు వీడీసీ సభ్యుల మరమ్మతు

రోడ్డుకు మరమ్మతు చేయిస్తున్న వీడీసీ సభ్యులు

వేల్పూర్, నవంబర్ 16: జాతీయ రహదారి నుంచి మండలంలోని పడిగెల్ గ్రామానికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ధ్వంసమైంది. నెలలు గడిచినా రోడ్డును అధికారులు బాగు చేయించకపోవడంతో స్థానిక గ్రామకమిటీ సభ్యులు స్పందించి శనివారం మరమ్మతు చేయించారు. గుంతల్లో మొరం పెయించి జేసీబీతో చదును చేయించారు.

దుబాయ్‌లో తప్పిపోయిన వ్యక్తిని కుటుంబ సభ్యులకు అప్పగించిన కోటపాటి

ఆర్మూర్‌టౌన్,నవంబర్16: దుబాయ్‌లో తప్పిపోయిన వ్యక్తిని క్షేమంగా ఇంటికి చేర్చినట్లు ప్రవాస భారతీయులు హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహ నాయుడు తెలిపారు. శనివారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. నిర్మల్‌కు చెందిన సురేశ్ పని కోసం దుబాయ్‌కు వెళ్లి తప్పిపోగా కుటుంబ సభ్యులు ద్వారా తెలుసుకొని దుబాయ్ అధికారులతో మాట్లాడి వెతికి ఇండియాకు రప్పించినట్లు తెలిపారు.

సంక్షిప్తంగా..

- **ధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ-** ఆర్మూర్‌టౌన్,నవంబర్16: పట్టణంలోని పెర్కిట్ బైపాస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ తనిఖీ చేశారు. రైతులు దళారులకు ధాన్యాన్ని విక్రయించవద్దన్నారు.
- **'సమగ్ర కుటుంబ సర్వేపై అపోహలు వద్దు'-** బోధన్, నవంబర్ 16: బోధన్ డివిజన్‌లో సమగ్ర కుటుంబ సర్వే చురుగ్గా సాగుతున్నదని, కొన్ని ప్రాంతాల్లో ముఖ్యంగా బోధన్‌లో సమగ్ర సర్వే విషయంలో అధికారులు, ఎన్యుమరేటర్లు మరింత శ్రద్ధ వహించాలని తాము ఆదేశాలు ఇచ్చామని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వేపై ప్రజలు అపోహలకు లోను కావొద్దని, ఈ సర్వేతో ఎంతో ఉపయోగం ఉంటుందన్న విషయాన్ని గమనించాలని ఆయన పేర్కొన్నారు. ప్రజలు సమగ్ర కుటుంబసర్వేకు సహకరించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.
- **సిద్దాపూర్ ట్రాక్టర్ల క్వారీ బంద్ -** బోధన్, నవంబర్ 16: మంజీరా నదిలో బోధన్ మండలంలోని సిద్దాపూర్ ట్రాక్టర్ల క్వారీలో శనివారం ఇసుక తవ్వకాలు కొనసాగలేదు. ఈ క్వారీకి ఇతర ప్రాంతాల ట్రాక్టర్లు రావద్దంటూ ఆ గ్రామస్తులు రెండు రోజుల క్రితం గొడవ చేయడంతో వే బిల్లుల జారీ జరగలేదు. మరోపక్క ఇసుక క్వారీలో ఇసుక నింపేందుకు కూలీలు రాకపోవడం ఇందుకు కారణాలని తెలిసింది. తిరిగి సోమవారం నుంచి ఇసుక తవ్వకాలు కొనసాగుతాయని రెవెన్యూ సిబ్బంది తెలిపారు.
- **వాహనాల తనిఖీ-** నవీపేట, నవంబర్15: మండలంలోని యంచ వద్ద శనివారం నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. బాసర ట్రిపుల్ ఐటీలో ఇటీవల ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో ఏబీవీపీ చలో బాసర పిలుపు మేరకు జిల్లా పోలీస్ అధికారులు ముందు జాగ్రత్తగా తనిఖీలు చేపట్టారు. తనిఖీలో నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.
- **ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన -** ముప్కాల్, నవంబర్16: నాగంపేట్ గ్రామంలో శనివారం జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ, ప్రీయానిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సు నిర్వహించారు. మండల ఉద్యాన వన శాఖ అధికారి రుద్ర వినాయన్ రైతులకు అవగాహన కల్పించారు. కంపెనీ క్లస్టర్ ఆఫీసర్ రాజేందర్ పాల్గొన్నారు.
- **ఉర్దూ పాఠశాలలో చోరీ-** నవీపేట, నవంబర్ 16: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం రాత్రి తాగునీటి వాటర్ ట్యాంక్ పైప్‌లతో పాటు తరగతి గదిలోని ఫ్యాన్లను దొంగలు ఎత్తుకెళ్లారని హెచ్ఎం అకీమ్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.
- **సమాజాభివృద్ధిలో జర్నలిస్టు పాత్ర కీలకం-** నవీపేట, నవంబర్ 16: సమాజాభివృద్ధిలో జర్నలిస్టు కీలక పాత్ర కీలమైనదని తహసీల్దార్ వెంకటరమణ అన్నారు. శనివారం స్థానిక లిటిల్‌ఫ్లవర్ స్కూల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పత్రికా దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్థానిక విలేకరులను తహసీల్దార్ వెంకటరమణ, ఎంపీడీవో నాగనాథ్, ఏఈవో అశోక్ సన్మానించారు. కార్యక్రమంలో విలేకరులు సాయన్న, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.
- **ఉత్తమ ఫలితాలు సాధించాలి -** రెంజల్, నవంబర్ 16: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని జీఈసీవో భాగ్యశ్రీ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఆమె తనిఖీ చేశారు. విద్యార్థినులతో మాట్లాడారు. మోడల్ స్కూల్‌లో హాస్టల్‌ను తనిఖీ చేసి వసతులపై ఆరా తీశారు. ఆమెవెంట ప్రత్యేకాధికారిణి శ్యామల ఉన్నారు.
- **ఏబీవీపీ నాయకుల ముందస్తు అరెస్టు-** రెంజల్, నవంబర్ 16: మండలంలోని పలు గ్రామాల ఏబీవీపీ నాయకులను శనివారం రెంజల్ పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థిని ఆత్మహత్యకు ప్రభుత్వమే కారణమంటూ నిర్మల్ జిల్లా బాసర ట్రిపుల్ ఐటీముట్టడికి ఏబీవీపీ శాఖ పిలుపు నిచ్చింది. నిరసనకు వెళ్లకుండా పోలీసులు పలువురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, **ISRAIL KHAN S/o. MOUL BAKASH** R/o. H.No. 4-1-754/4A, Aneesanagar, Bodhan, Dist. Nizamabad, Changed My Name as **ISMAIL KHAN**
NTZ-338205

PLOT FOR SALE

★**డిచ్‌పల్లి నుండి ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్** నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76=202 Sq.yds. ప్లాట్ల ధర 20,000/- గజం మరియు 34x27=102 Sq.yds. ప్లాట్ల ధర 15,000/- గజం అమ్మకానికి కలవు. Ph: 9396411685 / 9493984827.
NT-336743

WANTED

★**హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను,** పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338958

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

CHANGE OF NAME

I, **KASI VINAY REDDY S/o. BAJA REDDY KASI** (Old Name) H.No. 3-33/1, Jakranpally Village and Mandal Nizamabad Dist., Telangana, Hence my name changed as **KASHIREDDY BHASKAR** (New name) **S/o. BAKKANNA**

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములలో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పా